

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్‌రావు

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు

పటాన్‌చెరు/ దుబ్బాక, జనవరి 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యేలు తెలిపారు.

### ప్రొటోకాల్ అడ్డుకుంటున్నవారిని నిలువరించండి



రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు

పటాన్‌చెరు/ దుబ్బాక, జనవరి 23: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే హక్కులకు భంగం కలిగించేలా ఓడిపోయిన అధికార పార్టీ అభ్యర్థి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ నగరంలో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమన్నారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన ప్రొటోకాల్ హక్కును సైతం కాలరాయడం తగదన్నారు.

## భూసేకరణ వేగవంతం చేయాలి

- సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, జనవరి 23 : భూసేకరణ వేగవంతం చేయాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గౌరవెళ్లి రిజర్వాయర్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియపై సిద్దిపేట కలెక్టరేట్‌లో మంగళవారం నీటిపారుదల, సర్వే ల్యాండ్, రెవెన్యూశాఖల అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ మండలాలవారీగా మండల సర్వేయర్, ఆర్ఐ, ఇరిగేషన్ ఒక టీమ్‌గా ఏర్పడి ఆయా గ్రామాల్లో కాల్వల కోసం భూసేకరణ చేయాలన్నారు. కాల్వల వల్ల జరిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలం, సర్వే ల్యాండ్ ఏడీ వినయ్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లులపై కేసులు

- సివిల్ సప్లయ్ మెదక్ జిల్లా మేనేజర్ హరికృష్ణ

మెదక్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. హవేళీఘనపూర్ మండలం వాడి గ్రామంలోని శారదా ట్రేడర్స్‌కు 1765 టన్నుల ధాన్యం సరఫరా చేయగా, 1183 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, 230 టన్నులు మాత్రమే ఇచ్చారన్నారు. ఇంకా 1422 టన్నుల బియ్యం ఇవ్వలేదని, దాని విలువ రూ.4 కోట్ల 75 లక్షలు ఉంటుందన్నారు. బూర్గుపల్లిలోని భాగ్యలక్ష్మి ఇండస్ట్రీస్‌లో 784 టన్నుల ధాన్యాన్ని అప్పగిస్తే 525 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, 114 టన్నులు మాత్రమే ఇచ్చారని, ఇంకా 411 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. దీని విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాలంటూ ప్రభుత్వం అప్పగిస్తే మిల్లర్లు బియ్యం తిరిగి ఇవ్వకుండా బయట అమ్ముకొని వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. దీంతో రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

# పంచాయతీ పాలన ఇక ప్రత్యేకమేనా..?

ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల గడువు

ప్రస్తుత సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా.. కొనసాగించడానికి మొగ్గుచూపని ప్రభుత్వం



మెజార్టీ గ్రామాల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌లే...

ప్రత్యేకాధికారుల పాలనకు మొగ్గు చూపుతున్న సర్కారు

అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారుల ఎంపికకు యత్నాలు..?

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 1615 పంచాయతీలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పంచాయతీలు

| | |
|---|---|
| సిద్దిపేట | 499 |
| మెదక్ | 469 |
| సంగారెడ్డి | 647 |
| మొత్తం | 1615 |



సిద్దిపేట, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు నియామకం కానున్నట్లు తెలుస్తున్నది. ఎన్ని గ్రామాలు...ఎంత మంది అధికారులను నియమించాలి...? అని జిల్లాల వారీగా లెక్కలు తీసే పనిలో ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించాలి.. ఆలెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 1615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాలకు సరిపడా అధికారులను వెతికే పనిలో జిల్లాల అధికారులు ఉన్నారు.దీంతో గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న సిబ్బందిపై దృష్టి సారించారు. పోలీస్ శాఖ మినహా...మిగతా శాఖలైన రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య తదితర శాఖల్లో ఉన్న వారిని స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడానికి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఒక వేళ ప్రస్తుత సర్పంచ్‌లకే పర్సన్ ఇన్‌చార్జీలుగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ లెక్కన ఆయా గ్రామాల సర్పంచ్‌లను నియమించే విధంగా జాబితాలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటే ఆనిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్లడానికి జిల్లా అధికారులు జాబితాలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుత గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్నది. దీంతో ఇప్పటికప్పుడు పంచాయతీ ఎన్నికలు సాధ్యం కావు .. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు తమనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ మెజార్టీ గ్రామాల సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉండడంతో కాంగ్రెస్ ఆనిర్ణయం తీసుకోవడం లేదని తెలుస్తోంది.

### పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జంకుతున్న ప్రభుత్వం

పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతున్నది. గత శాసన సభ ఎన్నికల్లో అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆహామీల అమలులో ఘోరంగా విఫలమవుతున్నది. ఇప్పటికే గ్రామాల్లో కాంగ్రెస్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికిప్పుడు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని భావించి ప్రత్యేకాధికారుల పాలనను తీసుకువస్తున్నది. గత ప్రభుత్వం గ్రామాల్లో పదేండ్ల పాటు ఒకే రిజర్వేషన్ ఉండాలని పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. గత ప్రభుత్వం తీసుకువచ్చింది. పంచాయతీ ఎన్నికలను పాత రిజర్వేషన్ల ప్రకారం నిర్వహించవచ్చు.. ఇందులో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎన్నిక అవుతారని కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకున్నట్లు ఉంది. అందుకే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ జంకుతున్నదని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నది.

### పదవీకాలం ఇక తొమ్మిది రోజులే...

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గడువుకు కంటే ముందే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుంది.కానీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. పైగా వచ్చే నెలలోనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469, సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం (కేవలం తొమ్మిది రోజులు మాత్రమే) 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగుస్తుంది. 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. గత ఎన్నికల సమయంలో నూతనంగా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం రెండుసార్లు ఒకే రిజర్వేషన్ అందుబాటులో ఉంటుంది. ఆయితే బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత రిజర్వేషన్ విధానం కొనసాగించే పరిస్థితిలో లేదు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. వీటితో పాటు ఉపకులాల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటుందా ..? లేదా ..? వేచి చూడాల్సిందే.



మెదక్ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, ఇతర అధికారులు

## వ్యవస్థలపై నమ్మకం కలిగించాలి

- ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలిగించొద్దు
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- సకాలంలో ఆర్థిక పరిహారం అందించాలి
- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- మెదక్ కలెక్టరేట్‌లో అట్రాసిటీ చట్టంపై విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం

మెదక్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలిగించొద్దని మెదక్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అట్రాసిటీ చట్టంపై విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్ష' నిర్వహించారు. ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి కార్యక్రమానికి హాజరై సంబంధిత శాఖల అధికారులు ప్రవేశపెట్టిన నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులైన దళితుల పట్ల పోలీసులు, ఇతర శాఖల అధికారులు సున్నితంగా వ్యవహరించాలని, వారికి వ్యవస్థలపై విశ్వాసం కలిగించేలా పనితీరు ఉండాలని పేర్కొన్నారు. మూడు నెలలకోసారి ఈ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కేసుల్లో బాధితులకు ఇవ్వాల్సిన పరిహారం సకాలంలో అందించి వారికి సాంత్వన కలిగేలా చూడాలన్నారు. సాధారణ కేసుల్లో పోలీస్‌స్టేషన్లకి వెళ్తున్న ప్రజల పట్ల కూడా సున్నితంగా, సామరస్యంగా మెదిలేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ బాలస్వామికి ఎమ్మెల్సీ సూచించారు. అలాగే, సర్పంచుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని, ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీవోలు, డీఎస్పీలు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, తదితరలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిగుప్తా



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిగుప్తా

మెదక్ అర్బన్, జనవరి 23 : రోడ్డు భద్రతా మార్గదర్శకాలకనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిగుప్తా జిల్లా పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం అన్ని జిల్లాల పోలీస్ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో ఎస్పీ డాక్టర్ బాలస్వామితో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన పోలీస్ స్టేషన్లను గుర్తించి కారణాలు, తక్షణ నివారణ చర్యలు, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, చెట్లపొదల తొలిగింపు, రేడియం స్టిక్కర్లు, బ్లింకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిరుత సంచారం

- రైతులు జాగ్రత్తగా ఉండాలి : అటవీశాఖ అధికారి విద్యాసాగర్

రామాయంపేట, జనవరి 23: రామాయంపేట, చేగుంట మండలాల శివారు అటవీ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం అందిందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని రామాయంపేట అటవీశాఖ అధికారి విద్యాసాగర్, డిప్యూటీ అధికారి నాగరాణి పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు చేగుంట మండలం ఇబ్రహీంపూర్, కిష్టాపూర్, చిట్టోజిపల్లి, రుక్మాపూర్, రాంపూర్, కన్యారం, రామాయంపేట మండలం డి.ధర్మారం, శవ్వాయపల్లె గ్రామాల పరిధిలో చిరుత సంచరించినట్లు రైతులు తెలిపారన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, రాత్రి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లొద్దని, వెళ్లాల్సి వస్తే వెంట కర్రలు తీసుకుని వెళ్లాలన్నారు. సిబ్బందితో నిఘా పెట్టామని, చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.



చేగుంట, రామాయంపేట శివారులో సంచరిస్తున్న చిరుత

## పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, జనవరి 23 : పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేసి స్వచ్ఛభారత్‌కు ప్రతిరూపమైన కార్మికులను బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాంధీ కలలు కన్న స్వచ్ఛభారత్‌కు అసలు రూపం పారిశుధ్య కార్మికులేనని గుర్తుచేశారు.ప్రధాని నరేంద్రమోదీ పారిశుధ్య కార్మికులను సన్మానిస్తాడు కానీ వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. దళిత పారిశుధ్య కార్మికలకు ఉద్యోగ భద్రత కల్పించకుండా వారి ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్త చేశారు. కార్మికులు సమస్యల సాధన కోసం ఫిబ్రవరి 29న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద 'పోరుగర్జన' తలపెట్టామన్నారు. గర్జనకు మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు, పారిశుధ్య కార్మికులు పెద్ద ఎత్తున్న హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు రాజేందర్, కుమార్, వెంకటేశ్, కృష్ణ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

కాళేశ్వరం జలాలను కాల్వల ద్వారా తెచ్చుకోవాలి

గ్రామాల్లో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తా

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి..

నర్సంపల్లి పెద్దతండా, నర్సంపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

చేగుంట, జనవరి 23 ః కాళేశ్వరం నీళ్లను కాల్వల ద్వారా తెచ్చుకుని పంటలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి పెద్ద తాండ, నర్సంపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పెద్దతండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.10లక్షలతో ఎస్టీ కమ్యూనిటీ భవనం, రూ.40లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మనఊరు –మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.23 లక్షలతో నిర్మించనున్న పాఠశాల ప్రహరీకి భూమి పూజ చేశారు. అనంతరం నర్సంపల్లిలో రూ.4.50లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ, రూ.17లక్షలతో పల్లెదవాఖాన, రూ.20లక్షలతో పంచాయతీ, రూ.10 లక్షలతో మహిళా సంఘం, ఎస్సీ కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో పల్లెల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాళేశ్వరం జలాలను కాల్వల ద్వారా తెచ్చుకోవాల్సిన అవసరం ఉన్నదని, పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణం పూర్తి చేసేలా సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సాగునీటి శాఖ మంత్రులను కలిసి కాల్వలు పూర్తి చేయాలని కోరానన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీపీలు చిందం సబితా రవీందర్, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, సర్పంచులు ఛత్రీయ నాయక్ బొమ్మగారి భారతీసత్యం, సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రాజేష్, శ్రీపతిరావు, జెట్టి స్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, భాషా, లాలు, ముస్తాక్, సీడీపీవో స్వరూప, ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీ సుల్తానా, రమేశ్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నార్సింగి మండలం నర్సంపల్లిలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ప్రత్యేక అలంకరణలో కొండపోచమ్మ అమ్మవారు

## 'కొండ'ంత తన్మయత్వం

కొండపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆకట్టుకున్న డీజే నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు



అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

జగదేవపూర్, జనవరి 23: 'కొండపోచమ్మకు జై.. కొమురవెల్లి మల్లన్నకు జై' అంటూ భక్తుల నామస్మరణతో తీగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ క్షేత్రం మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అమ్మవారి జాతర మొదటివారం కావడంతో కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సోమవారం కొండపోచమ్మకు చేరుకున్నారు. జాతరలో యువకుల డీజే నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు అమ్మవారికి బోనం, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 35 మంది పోలీసులు బందోబస్తుతోపాటు సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా చేపట్టారు. భక్తులకు అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఈవో మోహన్‌రెడ్డి, సర్పంచ్ రజితారమేశ్ తెలిపారు.



అమ్మవారికి బోనం తీసుకొస్తున్న జోగిని